

ఉపాధిహామీ పనుల పరిశీలన

మందమర్రిరూరల్, మార్చి 11: మండలంలోని బొక్కలగుట్ట గ్రామంలోని ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎండలు ప్రారంభమైనందున తగు జాగ్రత్తలు తీసుకుంటూ పనులను చేయాలన్నారు. ఉదయం త్వరగా పనులను ముగించుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.



ఇఫ్తార్ | 6:26
మంగళవారం
సహర్ | 5:04
బుధవారం

రూ. 24.44 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

నస్పూర్, మార్చి 11 : నస్పూర్ మున్సిపాలిటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రత్యేక సమావేశం సోమవారం జరిగింది. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ళ వేణు అధ్యక్షతన మున్సిపల్ 2024-25 అంచనా బడ్జెట్ రూ. 24.44 కోట్లకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. బడ్జెట్ ఏజెండాను జేఏవో సిహెచ్ అనిత దేవి చదివి వినిపించారు. ఈ ప్రత్యేక బడ్జెట్ సమావేశంకు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ బి రాహుల్, చైర్మన్ సుర్మిళ్ళ వేణు, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, కమీషనర్ చిట్యాల సతీష్, ఆర్ఓ సతీష్, టీపీఎస్ సతీష్, మున్సిపల్ సహాయక ఇంజనీర్ మధు వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

టీపీఎస్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

నస్పూర్, మార్చి 11: నస్పూర్ పట్టణంలోని ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ సతీష్ ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు సీపీఐకి చెందిన 17వ వార్డు కౌన్సిలర్ మేకల దాసు పిర్యాదు చేశారు. నస్పూర్ మున్సిపల్ బడ్జెట్ సమావేశంకు పాల్గొనడానికి వచ్చిన కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. నస్పూర్ శివారులోని సర్వే నంబర్లు 42, 64, 72, 119లోని ప్రభుత్వ భూములు, వివాదస్పద భూముల్లో ఇళ్ళ నిర్మాణంకు అనుమతులు ఇస్తున్నరని మేకల దాసు ఆరోపించారు. మున్సిపల్ ఆదాయం పెంచడం కంటే సొంత ఆదాయం పెంచుకుంటున్నారన్నారు. టీపీఎస్ సతీష్‌తో పాటు ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ దాసు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కాగా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు గని కారణంగా దుమ్ముధూళి, బ్లాస్టింగ్‌తో 18,19,20 వార్డుల ప్రజల నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని 19వ వార్డు కౌన్సిలర్ రేగుంట చంద్రశేఖర్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. బ్లాస్టింగ్ శబ్దం వలన ఈ వార్డుల్లో ఇళ్ళు పగుళ్ళ వారుతున్నయన్నారు. దుమ్ముధూళి కారణంగా స్థానికులు శ్వాసకోశ వ్యాధులు, దగ్గు తదితర వాటి బారిన పడి ఇబ్బందులు పడుతున్నరన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా బ్లాస్టింగ్ పద్దతిలో సింగరేణి యాజమాన్యం అధునిక యంత్రాలను వినియోగించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.

పతకాలు సాధించిన పోలీసులకు అభినందన

హాజీపూర్, మార్చి 11: గుడిపేట 13వ బెటాలియన్‌లో విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు ఇటీవల పతకాలు సాధించడంతో సోమవారం పలువురు అభినందించారు. కానిస్టేబుళ్లు తిరుమలేష్, రాజేందర్ ఇటీవల నాగ్‌పూర్‌లో జరిగిన 72వ ఆలిండియా పోలీస్ చాంపియన్‌షిప్ వాలీబాల్ క్లస్టర్ (సెపక్‌తక్రా) పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఈ మేరకు గుడిపేట బెటాలియన్‌లో కమాండెంట్ సయ్యద్ జమీల్‌భా˜తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ పోటీల్లో రాజేందర్ రెండు కాంస్య పతకాలు, తిరుమలేష్ 1 కాంస్య పతకాన్ని సాధించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు నారాయణదాసు, కాళిదాసు, శేఖర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

మందమర్రిటౌన్/మందమర్రి రూరల్, మార్చి 11: మందమర్రి మండలంలోని అందుగులపేట, పులిమడుగు, బొక్కలగుట్టలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కడారి జీవన్‌కుమార్ సోమవారం ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో బీరయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చినప్పటికీ ఇంత వరకు నీరు రావడం లేదన్నారు. వేసవి కాలం ప్రారంభం కావడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వివేక్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, కార్తీక్, శేఖర్, సురేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి సన్మానం

జైపూర్, మార్చి 11: బదిలీపై వెళ్తున్న ఎస్సై ఉపేందర్‌కు సోమవారం జైపూర్ ఏసీపీ కార్యా లయంలో ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ బన్సీలాల్ ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎస్సై ఉపేందర్ పేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అని అన్నారు. ఎన్నో కష్టాలు ఎదుర్కొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించారని చెప్పారు. విధి నిర్వహణలో ఉద్యోగులు బదిలీ కావడం సహజమని, ఉద్యోగం చేసే సమయంలో ప్రజల్లో ఉపేందర్ మంచి పేరు తెచ్చుకున్నారని అభినందించారు. అనంతరం ఏసీపీ, సీఐలు ఎస్సైతో పాటు సిబ్బంది కూడా సన్మానించారు. కార్యక్రమంలో భీమారం, శ్రీరాంపూర్, జైపూర్ ఎస్సైలు రాములు, సతీష్, శ్రీధర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

నెన్నెల, మార్చి 11: రైతులు మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించా లని బెల్లంపల్లి క్లస్టర్ హార్టికల్చర్ అధికారి సుప్రజ అన్నారు. స్థానికంగా సోమవారం ఆమె మాట్లాడారు. సంగారెడ్డి పండ్ల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్ర మంగళవారం ఉదయం 11 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మామిడి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించనున్నారని చెప్పారు. భీమిని, కన్నాల రైతు వేదికల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రతికూల వాతావరణంతో మామిడికాయలు రాలడాన్ని నివారించడం, ఎరువులు, పురుగు మం దుల యాజమాన్యంపై వివరిస్తారని చెప్పారు. రైతులు పంట సాగులో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతారని తెలిపారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి



ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సత్యనారాయణ

కోటపల్లి, మార్చి 11: మండలంలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే పకడ్బందీగా చేపట్టాలని వైద్యాధికారి సత్యనారాయణ అన్నారు. స్థానికంగా సోమవారం ఆరోగ్య సిబ్బంది , ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శరీరంపై తెల్లని , రాగి, గోధుమరంగులో స్పర్శలేని మచ్చలు ఉంటే వ్యాధి లక్షణాలుగా చెప్పారు. అలాంటి వారికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో చికిత్స నిర్వహిస్తామన్నారు. దీనిపై గ్రామాల ప్రజలకు వివరించాలని కోరారు. వ్యాధిని మొదట్లోనే గుర్తిస్తే నయం అవుతుందని, ఈ నెల 23 వరకుసర్వే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 11 : జిల్లాలోని సీసీఐకు పత్తి విక్రయించిన రైతులు తమ బ్యాంకు, పోస్ట్‌బ్యాంకు ఖాతాలను ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసుకోకపోతే పత్తి అమ్మిన డబ్బులు జమ కావని పేర్కొన్నారు. ఇప్పటికే పత్తి అమ్మిన డబ్బులు జమ కాని రైతులు తక్షణమే ఇండియా పోస్ట్‌బ్యాంకు ఖాతా అయితే తమపాన్‌కార్డు, ఆధార్‌కార్డు తీసుకుని సమీపంలోని పోస్టాఫీసును సంప్రదించాలని సూచించారు. సేవింగ్ ఖాతాగా మార్చుకుని ధ్రువీకరించిన పత్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలో అందజేయాలని తెలిపారు. వివరాలకు 7330733454, 7330733462, 7330700446 నంబర్లలో సంప్రదిం చాలని సూచించారు.

విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ ప్రకటన హర్షణీయం

ఏసీసీ, మార్చి 11: ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు తదితర విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు చక్రపాణి, రాజవేణు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో సర్వీస్‌పర్సన్‌లను నియమిస్తామని, 2008 డీఎస్సీ బీఈడీ అభ్యర్థుల నియామకంపై ఈ నెల 12న జరిగే కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకుంటామని, జీవో 317 సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై సంఘాలతో చర్చించి పరిష్కరిస్తుందని ప్రకటించడం అభినందనీయమని తెలిపారు.

హైటెక్ సిటీలో సమస్యల తిష్ట



హైటెక్ సిటీలో ఇళ్ల మధ్యలో పారుతున్న డ్రైనేజీ నీరు



జిల్లాకేంద్రంలోని హైటెక్ సిటీకాలనీలో మౌలిక వసతులు లేక ప్రజ లు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ ఏర్పాటు చేసి సుమారు రెండు దశాబ్దాలు కావస్తున్నా సరైన డ్రైనేజీలు లేక మురుగునీరు వీధుల్లో పారుతుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

- దుర్గంధం వెదజల్లుతున్న కాలనీ
- డ్రైనేజీ లీకేజీలతో ఇళ్ల చుట్టు చేరుతున్న మురుగునీరు
- ఫిర్యాదు చేస్తే కంటితుడుపు చర్యలు
- శాశ్వత పరిష్కారం చూపని మున్సిపల్ అధికారులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

మంచిర్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీకాలనీ పరిస్థితి పేరు గొప్ప.. ఊరు దిబ్బ.. మాదిరిగా మారింది. ప్రజలకు కనీస సౌక ర్యాలు కూడ లేవంటే అతిశయోక్తి కాదు. హైటెక్ సిటీ పేరుతో వెంచర్ ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల కక్కుర్తి కారణంగా డ్రైనేజీ పైప్ లైన్‌లు తరుచుగా మొరాయిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వానాకాలం, ఎండకాలం తేడా లేకుండా నిత్యం ఇండ్ల చుట్టూ మురుగునీరు చేరుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

మొరాయిస్తున్న పైప్‌లైన్లు..

హైటెక్ సిటీ పేస్-1 వెంచర్‌ను 2005లో ఏర్పాటు చేసిన నిర్వాహకులు కాలనీకి అంతటికీ ఒకే ఒక్క సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. కాలనీ నుంచి అర కిలో మీటరు దూరంలోని రాముని చెరువు సమీపంలో సెప్టిక్ ట్యాంకు ఏర్పాటు చేయగా, ఇళ్ల నుంచి సెప్టిక్ ట్యాంకు వరకు పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టారు. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించిన వ్యాపారులు సిమెంటు పైపులు వేయడంతో అవి తరుచుగా లీకేజీ అవుతూ నీరంతా వీధుల్లో పారుతోంది. కాలనీలో సుమారు 1,200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాగా ఒకే ఒక సెప్టిక్ ట్యాంక్ కారణంగా ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. ఇళ్ల నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలను సెప్టిక్ ట్యాంక్‌కు తరలించే పైప్‌లైన్లు సరిగ్గా లేకపోవ డంతో మధ్యలోనే మురుగు నీరు లీక్ అయి బయటకు ప్రవహిస్తోంది. వ్యర్థపదార్థాలతో కూడిన మురుగు నీరు కాలనీలోని ఇళ్ల చుట్టూ పారు తుండడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. సెప్టిక్ ట్యాంక్ వరకు వేసిన పైప్‌లైన్లు సరిగ్గా లేక పోవడంతో నీటి సరఫరా సక్రమంగా లేక ఈ పరిస్థితి తలెత్తుతోందని కాలనీ వాసులు చెబుతున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా..

కాలనీలో డ్రైనేజీ నీరు సరఫరా సక్రమంగా లేని కారణంగా ఇళ్ల చుట్టూ చేరి, ఇబ్బందులకు గురి కావల్సి వస్తోందని పలుమార్లు స్థానికులు మున్సిపల్ కార్యాలయంతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదులు అందినప్పుడల్లా మున్సిపల్ సిబ్బంది తాత్కాలికంగా చర్యలు చేపట్టి నీరు మళ్లించే ప్రయత్నం చేస్తున్నారే కాని శాశ్వత చర్యలు చేపట్టక పోవడంతో పరిస్థితి యథాతథంగా ఉంటుందనే అభిప్రాయాలు సర్వత్ర వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో మురుగు నీరు బయట ప్రవహిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. డ్రైనేజీ నీరు పూర్తి స్థాయిలో సెప్టిక్ ట్యాంక్‌కు చేరేలా శాశ్వత చర్యలు చేపడితేగానీ పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశాలు కనబడడం లేదని ప్రజలు వాపోతున్నారు.

చేతులు దులుపుకున్న వ్యాపారులు..

హైటెక్ సిటీ వెంచర్ ఏర్పాటు చేసిన వ్యాపారులు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, నాలాలు, విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి ఏర్పాటు బాధ్యతలు వ్యాపారులపైనే ఉంటుంది. బడా వెంచర్ ఏర్పాటు చేసి న వ్యాపారులు ప్లాట్లు కొనుగోలు చేసిన వారి నుంచి పెద్ద మొత్తంలోనే వసూలు చేశారు. అయినప్పటికీ సౌకర్యాలు కల్పించడంలో మాత్రం కక్కుర్తి ప్రదర్శించడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు సమయంలోనే అన్ని జాగ్రత్తలు తీసుకుని ఉంటే పరిస్థితి మరోలా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్లాట్లు విక్రయించిన వ్యాపారులు చేతులు ఎత్తేయడంతో కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వ్యాపారుల కక్కుర్తి కారణంగా నిర్వహణ అట కెక్కగా మున్సిపాలిటీ కంటి తుడుపు చర్యలు చేపడుతుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. మున్సిపల్ పాలక వర్గం, అధికారులు స్పందించి తమ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పాదయాత్రకు తరలిరావాలి

- ప్రజాసంఘాల నాయకులు

కోటపల్లి, మార్చి 11: జోడువాగుల దగ్గర బ్రిడ్జి నిర్మాణంతో పాటు రోడ్డు నిర్మించాలనే డిమాండ్‌తో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రకు అన్ని ప్రజా సంఘాల నాయకులు తరలిరావాలని సీఐటీయూ, ఇతర సంఘాల నాయకులు కావిరి రవి, రాతిపల్లి నగేష్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ప్రజా సంఘాల నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని భీమారం జోడువాగుల దగ్గర ఇరుకైన బ్రిడ్జి , గుంతలమయమైన రోడ్డు ఉండడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని చెప్పారు. దీనిపై సీపీఎం చెన్నూరు, భీమారం, కోటపల్లి కమిటీల ఆధ్వర్యంలో జోడు వాగుల దగ్గర నుంచి భీమారం తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సీఐటీయూ, కేవీపీఎస్, డీవైఎఫ్ఐ, పీఏవీఎస్, ఏఐకేఎస్, ఐద్వా, మత్స్యకార్మిక సంఘాలు మద్దతు తెలిపాయన్నారు. సమావేశంలో నాయకులు దూర్కె మోహన్, సమ్మక్క, బూదక్క, రాజేశ్వరి, నాగజ్యోతి, అనిల్, మహేష్, చంద్రన్న, శ్రీనివాస్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

చెన్నూరు: భీమారం జోడు వాగుల వద్ద నుంచి భీమారం తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం నిర్వహించే పాదయాత్రను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. సోమవారం చెన్నూరులో నాయకులు మాట్లాడుతూ జోడు వాగుల వద్ద బ్రిడ్జి, రోడ్డు నిర్మించాలని కోరుతూ పాదయాత్ర చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, నగేష్, సమ్మక్క, భూదక్క, రాజేశ్వరి, జ్యోతి, ఉమారాణి, అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

నెన్నెల, మార్చి 11: ముస్లింలు ఆచరించే ఉపవాస దీక్షల (రోజా) పవిత్ర రంజాన్ మాసం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. సోమవారం సాయంత్రం ముస్లిం లు తరావీహ్ నమాజుతో ఖురాన్ పఠనానికి శ్రీకారం చుట్టారు. కఠిన ఉపవాస దీక్షలకు ఉపక్రమించారు. ఇంటిల్లిపాది నెల రోజుల పాటు ప్రత్యేక నమాజ్‌లు చేస్తారు. నియమ నిష్టలతో రోజులో దాదాపు 14 గంటల పాటు రోజాలో ఉంటారు. మజీదుల్లో సామూహికంగా ప్రార్థనలు చేసి ఇఫ్తార్‌తో రోజా విరమణ చేస్తారు. రోజులో ఐదు పూటల నమాజ్ చేస్తూ, పవిత్ర గ్రంథం ఖురాన్ పఠిస్తూ 30 రోజులు దైవారాధనలో గడుపుతారు. ప్రతి రోజు రాత్రి ఇషా నమాజ్ తర్వాత సుదీర్ఘ తరావీహ్ నమాజ్ చేస్తారు. ఖురాన్‌లోని 30 (పార) భాగాలలో రోజుకు కొంత చొప్పున చదివి పవిత్ర గ్రంథం అవతరించిన షబేఖదర్ నాటికల్లా పూర్తి చేస్తారు. రంజాన్ సంబరాల్లో పేద ప్రజలను కూడా భాగస్వాములను చేయడం కోసం ధనికులు నిరుపేదలకు ఫిత్ర, జకాత్‌ల పేరిట దానాలు చేస్తారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏసీసీ, మార్చి 11: మంచిర్యాల పట్టణంలోని 9వ వార్డు గ్రీన్ సిటీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ మహిళలు సోమవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ డ్రైనేజీ సక్రమంగా లేదని, రోడ్లు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న మున్సిపల్ చెత్త డంపింగ్ యార్డు వల్ల దుర్వాసన, పొగ వ్యాపించి అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

జన్నారం, మార్చి 11: మండలంలో అభివృద్ధి పనులకు సంబంధించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీఎల్‌పీవో ధర్మారాణి సూచించారు. జన్నారం మండలంలోని పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాల యాన్ని సోమవారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా వందశాతం పన్నులను వసూలు చేయాలని సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే చర్యలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, ఈవో రాహుల్, పంచాయతీ సిబ్బంది, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రధానిపై వ్యాఖ్యలు సరికాదు’

ఏసీసీ, మార్చి 11: ప్రధాని మోదీకి కుటుంబమే లేదని పలువురు చేస్తున్న వ్యాఖ్యలు సరికాదని బీజేపీ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో సోమవారం మోదీపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రధాని మోదీకి కుటుంబమే లేదని కించరుస్తూ కొందరు వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. దేశ ఉన్నతిని ప్రపంచ దేశాలకు చాటి చెబుతూ గత 9 సంవత్సరాలుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా మోదీ దేశం కోసం శ్రమిస్తున్నారని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని, దేశాభివృద్ధికి పాటుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బోయిని హరికృష్ణ, తోట మల్లికార్జున్, కర్రె లచ్చన్న, గాజుల ప్రభాకర్, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తాం

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 11: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, ఆర్అండ్ఆర్ ప్రత్యేక ఉప పాలన అధికారి చంద్రకళతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జైపూర్, చెన్నూరు, కోటపల్లి, హాజీపూర్, బెల్లంపల్లి, మంచిర్యాల ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చిదరఖాస్తులు అందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 56 దరఖాస్తులు అందాయని, వీటిని సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించడం జరుగుతుదంన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అదికారులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

● నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు

మంచిర్యాల కలెక్టరేట్: ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు కేంద్రాల ద్వారా వరిధాన్యం కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్‌చాంబర్‌లో జిల్లా పౌరసరఫరాల అధికారి వాజిద్, మేనేజర్ గోపాల్, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి, జిల్లా రవాణా అధికారి సంతోష్‌కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలుకేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. ఏ గ్రేడ్‌రకానికి క్వింటాలుకు రూ.2,203, సాధారణ రకంకు రూ. 2183 మద్దతు ధర నిర్ణయించామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులను సమకూర్చుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు తాగునీరు, నీడ కల్పించాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు

జైపూర్, మార్చి 11: జిల్లాలో పలువురు ఎస్సైలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జైపూర్ ఎస్సైగా శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఉపేందర్ మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ ఎస్సైగా బదిలీ అయ్యారు. భూపాలపల్లి జిల్లా నుంచి శ్రీధర్ బదిలీపై జైపూర్‌కు వచ్చారు. ఎస్సైకి సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీధర్ మాట్లాడు తూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

నెన్నెల: నెన్నెల ఎస్సైగా కుందరపు ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మంచిర్యాలలో పనిచేసిన ఆయన నెన్నెలకు బదిలీపై వ చ్చారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడతామని తెలిపారు.

కన్నెపల్లి: కన్నెపల్లి ఎస్సైగా గంగారాం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాసిపే ట నుంచి బదిలీపై కన్నెపల్లికి వచ్చారు. సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భీమిని: భీమిని ఎసైగా ఎం విజయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీరాంపూర్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ప్రశాంత్ రామగుండం కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లారు.

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి పోలీస్‌స్టేషన్ ఎస్సైగా శ్యాంపటేల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై సుబ్బారావు బదిలీపై రామగుండంకు వెళ్లారు. ఆయన స్థానంలో నెన్నెల ఎస్సై బదిలీపై నీల్వాయికి వచ్చారు.

● సంక్షిప్తం..

- చెన్నూరు: మండలంలోని కిష్టంపేట పల్లెదవాఖానా, అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కన్నెపల్లి గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి జ్వరం ఉన్నట్లు గుర్తించి మందులను అందజేశారు.
- కోటపల్లి: ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో ఆకుల భూమన్న అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండల అధికారులకు పలు సూచనలు చేశారు.
- భీమారం: మండల కేంద్రంలోని అంబేద్కర్‌కాలనీలో 15 రోజులుగా తాగునీరు రావడం లేదని, సమస్య పరిష్కరిం చాలని మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే నిరసనలు ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాజు, కిష్టమ్మ, మల్లు, తదితరులు పాల్గొన్నారు.
- రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు కుస్నోతు సంతోష్‌రాం బీజేవైఎం టౌన్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. సంతోష్ రాం మా ట్లాడుతూ బీజేవైఎం టౌన్ ప్రెసిడెంట్‌గా రెండోసారి బాధ్యతలను అప్పగించిన పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్, సీనియర్ నాయకులు ఆర్మాల్ల పోషం, చెన్నూరు అసెంబ్లీ కన్వీనర్‌గ అక్కల రమేశ్‌కు కృత జ్ఞతలు తెలిపారు.
- బెల్లంపల్లి: మండలంలోని బెల్లంపలి- 2 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ జ్యోతి తల్లులు, పిల్లల పోషణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు.
- జన్నారం: ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.
- ఏసీసీ: ఇంటర్ మీడియట్ పబ్లిక్ పరీక్ష సోమవారం జిల్లా వ్యాప్తంగా సజావుగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 25 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు

- యువత వ్యసనాల బారిన పడొద్దు
- బెల్లంపల్లి రేంజ్ అటవీశాఖ క్షేత్ర అధికారి సుభాష్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుభాష్

కాసిపేట, మార్చి 11: క్రీడలతో మంచి స్నేహ సంబంధాలు పెంపొందడంతో పాటు శారీరక ధృడత్వం, మానసిక ఉల్లాసం లభిస్తుందని బెల్లంపల్లి రేంజ్ అటవీశాఖ క్షేత్ర అధికారి సుభాష్ అన్నారు. సోమవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో తాటిగూడెం క్రీడా మైదానంలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంతకు ముందు ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. నేటి యువతరం దిశా నిర్దేశం లేక ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకోవడం లేదన్నారు. వ్యసనాలకు బానిస అవుతున్నారన్నారు. దీంతో సంఘ విద్రోహ శక్తులుగా మారే అవకాశం ఉందన్నారు. వ్యసనాలకు లోను కాకుండా యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అలాగే వన్య ప్రాణులు, అటవీ సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. స్థానిక యువకులు అటవీ సంరక్షణకు పాటు పడాలని కోరారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో 28 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్, ఎఫ్ఎస్‌వో ప్రభాకర్, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ

రామకృష్ణాపూర్, మార్చి 11: రామకృష్ణాపూర్ పరిధిలోని అంగడి బజార్, రాజరాజేశ్వరి స్వామి ఆలయం, ఏ-జోన్ వేంకటేశ్వర స్వామి ఆలయం, రైల్వే స్టేషన్ మహంకాళి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు ఆదివారం రాత్రి ఆలయాలలోని హుండీ పగలగొట్టి సుమారు 15 వేల రూపాయలను ఎత్తుకెళ్లినట్లు పట్టణ ఎస్సై ఏ రాజశేఖర్ తెలి పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అయన తెలి పారు. మార్చి 5 సోమవారం రాత్రి పెద్దమ్మ తల్లి వైన్ షాపులో దొంగలు పడి సుమారు 63 వేల సొత్తు ఎత్తుకెళ్లారు. . పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జీరో కరెంట్ బిల్లుల పరిశీలన

చెన్నూరు, మార్చి 11: మండలంలోని సోమనపల్లిలో సోమవారం జీరో విద్యుత్ బిల్లులను ట్రాన్స్‌కో డీఈ కైజర్ పరిశీలించారు. జీరో విద్యుత్ బిల్లులు రాని లబ్ధిదారులు చెన్నూరులోని ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఏవో శ్రీనివాస్, ఏడీఈ రవికుమార్, ఏఈ బాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను వేధించిన యువకుడిపై కేసు

ఏసీసీ, మార్చి 11: మహిళను వేధించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం భీమారంకు చెందిన గొల్లపల్లి మహేష్ అనే యువకుడు కొన్ని రోజులుగా మంచిర్యాల పట్టణంలోని జన్మభూమినగర్‌కు చెందిన ఆర్టీసీ బస్ కండక్టర్‌ను వేధిస్తున్నాడు. ఫోన్‌లోతరుచూ అసభ్యంగా మాట్లాడడంతో పాటు ఆదివారం రాత్రి మంచిర్యాల బస్టాండ్‌లో విధుల్లో ఉన్న ఆమె వద్దకు వచ్చి వేధించాడు. ఆమె భర్త స్థానికుల సహాయంతో మహేష్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రెస్‌క్లబ్ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు


జన్నారం, మార్చి 11 : జన్నారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి ఎంపీ సోయం బాపురావు తన ఎంపీ నిధుల నుంచి రూ. 4 లక్షలు మంజూరు చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు తెలిపారు. సోమవారం ఎంపీడీవో శశికళకు ప్రొసీడింగ్ కాపీని అందించారు. భవనాన్ని త్వరగా పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నరసయ్య, బీజేపీ నాయకుడు రాజశేఖర్, ప్రెస్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో చంద్రబాబుపై మరో కేసు

» అసైన్డ్ భూముల కేసులో ఏ-40గా చేర్చిన సీఐడీ

విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం మరో కేసు నమోదు చేసింది. ఇప్పటి వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫైబర్‌గ్రిడ్ కేసుల్లో నిందితుడిగా చేర్చిన సీఐడీ.. తాజాగా అసైన్డ్ భూముల కేసు ఎఫ్ఐఆర్‌లోనే గాక చార్జిషీటులోనూ నిందితుడి(ఏ-40)గా పేర్కొంది. రాజధాని అమరావతిలో వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, మందడం, రాయపూడి గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేశారని వరప్రసాదరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై మాజీ మంత్రి పి.నారాయణ, ఆయన కుటుంబ సభ్యులపై సీఐడీ గతంలో కేసులు (క్రైం నంబర్ 14/2020, 15/2020) నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్‌లలో ఎక్కడా చంద్రబాబు పేరు లేదు. ఇప్పుడు 14/2020 కేసులో ఆయనతో పాటు 22 మందిని నిందితులుగా పేర్కొంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం చార్జిషీటు, మెమో దాఖలు చేసింది. వీరిలో నారాయణ బంధువు పి.సుబ్రహ్మణ్యాన్ని ఏ-41గా చేర్చింది. వీరందరిపై ఐపీసీ 120బీ, 420, 506 రెడ్‌విత్ 120బీ సెక్షన్లు, అసైన్డ్ భూముల బదిలీ నిషేధం చట్టంలోని సెక్షన్ 7, ఎస్సీ, ఎస్టీ చట్టంలోని 3(1)(జీ), (2)(వీఏ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 2 కేసులకు సంబంధించి ఒకటే చార్జిషీటును కోర్టుకు సమర్పించారు. కాగా, యువగళం ముగింపు సభలో లోకేశ్ చేసిన రెడ్‌బుక్ వ్యాఖ్యలపై సీఐడీ వేసిన పిటిషన్‌పై విచారణ 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలుకు ఆయన తరపు న్యాయవాది లక్ష్మీనారాయణ సమయం కోరారు. ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో న్యాయాధికారి హిమబిందు విచారణను 21వ తేదీకి వాయిదా వేశారు.

నేటి నుంచే రంజాన్



(మొదటి పేజీ తరువాయి)

ముస్లింలు భావిస్తారు. అలాగే ఎంతో శుభప్రదమైన ఈ నెలలో నరకలోక ద్వారాలు మూసుకుని, స్వర్గలోకపు ద్వారాలు తెరుచుకుంటాయని వారు నమ్ముతారు. దేవునిపై విశ్వాసాన్ని, భయభక్తులను, భక్తిశ్రద్ధలను తెలుపుకునేందుకు ముస్లింలు రోజా (ఉపవాస దీక్షలు) పాటిస్తారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తూ ఐదుపూటలా నమాజు, ఇషా తరువాత తరావీహ్ (ప్రత్యేక ప్రార్థనలే)తో పాటు అర్ధరాత్రి పూట తహజ్జుద్ నమాజ్ పేరుతో ఏకాంత ఆరాధనలో లీనమవుతుంటారు. చివరి పది రోజులలో ఎతేకాఫ్ పాటిస్తారు. అలాగే ధనవంతుడైన ప్రతి ముస్లిం దానధర్మాలకు అధిక ప్రధాన్యమిస్తారు. తమ ఆస్తిలో రెండున్నర శాతం తీసి పేదలకు పంచిపెడతారు. నెల రోజుల అనంతరం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలను ముగించి రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్)ను జరుపుకుంటారు. మరోవైపు రంజాన్ నెలవంక దర్శనంతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని పాతబస్తీలో మటన్, చికెన్ షాపులు, కూరగాయల మార్కెట్‌లు, కిరాణా షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

ముస్లింలకు సీఎం రంజాన్ శుభాకాంక్షలు

నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లింలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణనిస్తుందని అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ముస్లింల సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించి, వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఆనాడు కేసీఆర్ పేషీలో

ఒక్క దళితుడున్నారా?

చిన్న సంఘటనపై బీఆర్ఎస్ విష ప్రచారం.. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, బీర్ల అయిలయ్య

హైదరాబాద్/న్యూఢిల్లీ/జగిత్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన పేషీలో ఒక్క దళితుడైనా ఉన్నారా అంటూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో జరిగిన చిన్న సంఘటనను చూపి ఏదో అయినట్లు బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు చేస్తోందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.. తెలంగాణ తొలి సీఎంగా దళితుడిని చేస్తానన్న కేసీఆర్.. చేశాడా అని ప్రశ్నించారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయన ఎలా అవమానించిందీ ప్రజలే చూశారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు దళిత మంత్రులు ఎన్నిసార్లు కలవగలిగారని ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో పూర్వమున్న వసతులనూ సీఎం రేవంత్ కల్పిస్తున్నారని.. గుట్టలో నిద్రచేసే వెసులుబాటు, కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాట్లు చేశారని విప్ అయిలయ్య అన్నారు. కాంగ్రెస్‌కు క్రెడిట్ దక్కుతుందని చెప్పి.. డిప్యూటీ సీఎం భట్టికి అవమానం జరిగిందంటూ బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు. భట్టి కూర్చున్న కుర్చీ చిన్నగా ఉన్నందు వల్ల అలా కనిపిస్తోందని వివరణ ఇచ్చారు. మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన కేటీఆర్‌కు.. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ అన్నారు. సీఎంను గురించి ఆయన పిచ్చిమాటలు మాట్లాడితే ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో చేర్చడం ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ గురించి అనవసర వ్యాఖ్యలు చేస్తే హైదరాబాద్‌లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల్లో సీఎం రేవంత్‌కు ఉన్న ఆదరణ చూసి కేటీఆర్ ఓర్చుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. 'బిడ్డా కేటీఆర్..! మా సీఎం రేవంత్‌పైన మాట్లాడే స్థాయి నీకుందా? నీ భాష మార్చుకోక పోతే బట్టలు ఊడదీసి ఉరికిస్తం.. నువ్వు మొగోనివైతే లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్లలో మెజారిటీ తెచ్చి చూపించు!'అని సవాల్ విసిరారు. రేవంత్ పట్ల కేటీఆర్ మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. కేసీఆర్ ఎక్కడ రాజకీయాలు మొదలుపెట్టి ఎక్కడ మంత్రి, డిప్యూటీస్పీకర్ అయ్యారో కేటీఆర్ చెప్పాలన్నారు. కేటీఆర్ ఇలాగే మాట్లాడితే తెలంగాణ ప్రజలు.. బీఆర్ఎస్‌కు ఉన్న ప్రతిపక్ష హోదా లేకుండా చేసి బయటకు పంపుతారన్నారు.



జగిత్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రెండ్రోజుల్లో గొల్లకురమల కార్పొరేషన్

గొల్ల, కురమల కార్పొరేషన్‌ను మరో రెండ్రోజుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటుతో గొల్ల, కురుమలకు లబ్ధి చేకూర్చుతుందన్నారు. గొల్ల కురమలకు బీఆర్ఎస్ పదేళ్ల పాటు అన్యాయం చేసిందని మండిపడ్డారు. గొల్ల కురుమలకు 4 అసెంబ్లీ సీట్లు కేటాయించి.. అధికారంలోకి రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్ నిలబెట్టుకుంటున్నారని వెల్లడించారు.

మోదీకి చిత్తశుద్ధి లేదు:వీహెచ్

ఓబీసీ ప్రధాని అని చెప్పుకొనే నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి బీసీలకు ఏం చెప్తారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ప్రశ్నించారు. కులగణన చేస్తామని ప్రకటించడానికి వస్తున్నారా? అని నిలదీశారు. ఓట్ల కోసం అయోధ్య రామమందిరం, కాశీ గురించి మాట్లాడడమే తప్ప బీసీల అభివృద్ధి పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో వీహెచ్ మాట్లాడుతూ.. కులగణన కోసం మోదీని ఓబీసీ ఎంపీల బృందం ఆధ్వర్యంలో నాలుగు సార్లు కలిసినప్పటికీ హామీ ఇవ్వలేదన్నారు. కాగా, జగిత్యాలలో ఇటీవల జరిగిన మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ రెబల్‌గా పోటీ చేసి విజయం సాధించిన అడువాల జ్యోతి లక్ష్మణ్ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం జగిత్యాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

22 ఎకరాల నిషేధిత జాబితా భూమి..

ఎంపీ సంతోష్‌కు పట్టా

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. "సంతోష్ అనే బీఆర్ఎస్ ఎంపీ, వారి కుటుంబానికి చెందినవారి పేరుమీద కూడా భూములున్నాయి. అప్పటివరకు 22(ఎ) కింద నిషేధిత జాబితాలో ఉన్న భూమి వారి పేరిట పట్టా అయింది. ఆ గ్రామంలో అందరి భూములూ నిషేధిత జాబితాలో ఉంటాయి. కానీ, ఆయనకు మాత్రం ఆ 22 ఎకరాలు పట్టా అయిపోయింది" అని కోదండరెడ్డి అన్నారు. ఎంపీ సంతోష్ భార్య, ఓ ఎమ్మెల్సీ, ఇద్దరు ఆ పార్టీ నేతలు కలిసి ఒకే గ్రామంలో నిషేధిత జాబితాలో ఉన్న 22 ఎకరాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ నలుగురికి చెందిన ఒక కంపెనీ పేరుతో ఈ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఎలా పట్టాలుగా మార్చుకున్నారనేందుకు ఇది ఒక్క ఉదాహరణ మాత్రమేనన్నారు. ఇలాంటి రిజిస్ట్రేషన్లపై తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. మరోవైపు వివాదరహితంగా ఉన్న 23 లక్షల ఎకరాలను వివాదాస్పద భూముల కేటగిరీ(బీ)లో చేర్చారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనన్ని భూ కుంభకోణాలు ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో జరిగాయని ధ్వజమెత్తారు. ఎవరినీ సంప్రదించకుండా గతంలో దివాళా తీసిన విదేశీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు అప్పగించారని కోదండరెడ్డి తెలిపారు. ఆ తర్వాత ఇదే కంపెనీ టెరాసీస్, క్వాంటెల్లాగా పేర్లు మార్చుకుందని వివరించారు. ఈ మూడు కంపెనీలు రాష్ట్రానికి చెందిన రామలింగరాజు కుటుంబీకుడు శ్రీగారి శ్రీధర్‌రాజు పేరిట ఉన్నాయని తెలిపారు. రామలింగరాజు కుటుంబానికి కేటీఆర్‌తో అవినాభావ సంబంధం ఉందన్నారు. ధరణి పేరుతో కేసీఆర్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఆ శాఖ మంత్రిగా కూడా ఉన్న గత సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దీనికి ప్రధాన కారణమని కోదండరెడ్డి ఆరోపించారు. కేటీఆర్ తన కార్యాలయంలో ధరణికి సంబంధించి ప్రత్యేకంగా ఒక వ్యవస్థనే పెట్టుకున్నారని తెలిపారు.

17 వరకు స్పెషల్ డ్రైవ్..

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్‌ను మరో వారం రోజులపాటు పొడిగించారు. దరఖాస్తులు భారీగా వస్తున్నందున దీనిని ఈ నెల 17 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు 2.45 లక్షల ధరణి దరఖాస్తులు పరిష్కారం దిశగా ఉన్నాయని తెలిపింది.

ప్రణీత్‌రావు ఎక్కడ?

» సిరిసిల్లలో పంజాగుట్ట పోలీసుల గాలింపు
» అదుపులోకి తీసుకున్నట్లుగానూ ప్రచారం?
» పథకం ప్రకారమే ట్యాపింగ్.. డేటా మాయం
» హార్డ్ డిస్కుల ధ్వంసం కేసులో కీలక ఆధారాలు
» గత ప్రభుత్వ పెద్దల అండతో ఎస్ఐబీలో హవా
» ప్రతిఫలంగానే అడ్డదారిలో ఆయనకు పదోన్నతి?
» ప్రణీత్‌కు సహకరించిన అధికారుల్లో గుబులు

హైదరాబాద్ సిటీ, సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సస్పెండైన డీఎస్పీ ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు ఎక్కడ ఉన్నారనేది తెలియడం లేదు. ఫోన్‌లు స్విచ్ఛాఫ్ ఉండడంతో పాటు, అజ్ఞాతంలోకి వెళ్లినట్లు అనుమానిస్తూ ఆయనను పట్టుకునేందుకు హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం వీరు సిరిసిల్ల వచ్చి స్థానిక శ్రీనగర్ కాలనీలో ప్రణీత్ అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద రాత్రి వరకు పహారా కాసినట్లు తెలిసింది. ఓ దశలో అదుపులోకి తీసుకున్నారని, రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఏ సమయంలోనైనా హైదరాబాద్ తరలించే అవకాశం ఉందని ఊహాగానాలు వచ్చాయి. అయితే, ప్రణీత్ విషయం తమకు తెలియదని, పంజాగుట్ట పోలీసులకే సమాచారం ఉంటుందని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పంజాగుట్ట పోలీసులు సైతం ప్రణీత్ ఇంకా దొరకలేదని చెప్పారు. హైదరాబాద్‌లోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) డీఎస్పీగా పనిచేస్తున్న ప్రణీత్ ఫిబ్రవరి 20న బదిలీపై సిరిసిల్ల డీసీఆర్బీలో చేరారు. రిపోర్టు చేసిన వెంటనే హైదరాబాద్ వెళ్లిపోయినట్లు తెలిసింది. ట్యాపింగ్ ఆరోపణలతో ఈ నెల 5న సస్పెండయ్యారు. కాగా, ఎస్ఐబీ కార్యాలయంలో.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు ప్రతిపక్ష నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించిన హార్డ్ డిస్కులను ప్రణీత్ ధ్వంసం చేశారని ఆదివారం అదనపు ఎస్పీ రమేష్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ప్రణీత్‌తో పాటు, మరికొందరిపై పంజాగుట్ట స్టేషన్‌లో ఐపీసీ 409, 427, 201, 120(బి), సెక్షన్(3) ఆఫ్ పీడీపీపీ యాక్ట్, 65, 66, 70 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి.

పథకం ప్రకారం ఎస్ఐబీకి.. 'అద్భుత పనితీరు'తో డీఎస్పీ

గత ప్రభుత్వంలోని పెద్దలతో దగ్గరి బంధుత్వం ఉండడం, వారి అండతో ప్రణీత్ పథకం ప్రకారం ఎస్ఐబీకి వెళ్లి చక్రంతిప్పినట్లు పోలీసులు కీలక సమాచారం సేకరించారు. 2007 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన 2018లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం ఎస్ఐబీకి మార్చగా ఆ విభాగం ఉన్నతాధికారుల తోడ్పాటుతో రెండు గదుల్లో ఇంటర్నెట్ కనెక్షన్‌తో 17 కంప్యూటర్లను అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు. వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా, అనధికారికంగా, చట్ట విరుద్ధంగా సేకరించడమే కాక స్వయంగా పర్యవేక్షించినట్లు కచ్చితమైన ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఎన్నికల ఫలితాలు విడుదలైన మరుసటి రోజే ఎస్ఐబీ కార్యాలయంలో సీసీ కెమెరాలు బంద్ చేయించి, టెక్నీషియన్ సాయంతో కంప్యూటర్లలోని డేటా, కీలక వివరాలు కాపీ చేసుకుని, హార్డ్ డిస్కులను ధ్వంసం చేసి కాల్చివేశారు. తనపై అనుమానం రాకుండా కొత్త హార్డ్ డిస్కులను ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలింది. కాగా, చెప్పినట్లు చేసినందుకు 'అద్భుతమైన పనితీరు' కింద నిరుడు మార్చిలో ప్రణీత్‌కు డీఎస్పీగా పదోన్నతి ఇచ్చారు. దీనిపై ఆయన బ్యాచ్‌మేట్స్, ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. మరోవైపు ట్యాపింగ్‌లో కొందరు అధికారులకూ పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రణీత్ తర్వాత వీరినీ విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం మేరకు ఈ కుట్రలో ఎవరి పాత్ర ఎంత..? అనేది దానిపై దర్యాప్తు చేస్తున్నారు. కేసు సంచలనంగా మారుతుండడంతో ప్రణీత్ కు సహకరించిన ఉన్నతాధికారుల్లో గుబులు మొదలైంది.

సీఎం సార్...
మా మొర ఆలకించండి!

» ఆర్ అండ్ బీలో సర్వీస్ రూల్స్ ఖరారు చేయండి
» సీఎం రేవంత్‌కు, మంత్రి కోమటిరెడ్డికి ఉద్యోగుల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ అంశాన్ని పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. గత ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దాంతో తమకు పదోన్నతులు వచ్చినా అవి తాత్కాలికమే కావడంతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి హోదాలోనే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆర్ అండ్ బీ లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్‌ను పరిష్కరిస్తే దాదాపు 300 నుంచి 400 మంది ఉద్యోగులకు పదోన్నతులు కలుగుతాయన్నారు. వాస్తవానికి ఆర్ అండ్ బీ పదోన్నతుల అంశం ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన సీనియారిటీ జాబితాపై ఆధారపడి ఉన్నప్పటికీ సర్వీస్ రూల్స్ తేలితే కిందిస్థాయి పదోన్నతులు ఒక కొలిక్కి వస్తాయని ఉద్యోగులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో సర్వీస్ రూల్స్ పూర్తయ్యాయని, తమ శాఖలోనూ అందుకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయినా గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పెండింగ్‌లో ఉండిపోయిందని పలువురు ఉద్యోగులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. కాగా సర్వీస్‌రూల్స్‌ను ఖరారు చేస్తే ఆర్ అండ్ బీలో జరిగిన పునర్వ్యవస్థీకరణతో ఏర్పడిన కొత్త కార్యాలయాలకు సిబ్బంది పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

తవ్విన కొద్దీ బయటపడుతున్న
అక్రమ పౌరసత్వాలు!

» తాజాగా 125 పెరిగిన సంఖ్య.. 24 మంది అరెస్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విదేశీయులకు అడ్డదారుల్లో పౌరసత్వం ఇచ్చిన కేసులో సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించి.. నకిలీ గుర్తింపు, విద్య, ఇతర ధ్రువీకరణ పత్రాలు పొంది.. వాటి ఆధారంగా పాస్‌పోర్టులు పొందిన వారి సంఖ్య తొలుత 95గా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు అనుబంధంగా మరికొన్ని చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదవుతుండడం.. ఈ ముఠాలకు పశ్చిమబెంగాల్‌లోని ఫేక్ సర్టిఫికెట్ల గ్యాంగ్‌తో లింకులను సీఐడీ నిర్ధారించింది. కొత్తగా మరో 30 మంది ఇలా అక్రమంగా పాస్‌పోర్టులు తీసుకున్నట్లు గుర్తించారు. దీంతో.. నకిలీ పత్రాలతో పౌరసత్వాన్ని పొందిన విదేశీయుల సంఖ్య 125కు చేరింది. చెన్నైకి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్ మురళీధరన్ రాధ ఈ కేసులో కీలకంగా వ్యవహరించినట్లు తేల్చారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తే.. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ కేసులో సీఐడీ ఇప్పటి వరకు 24 మందిని అరెస్టు చేసింది. విదేశాలకు వెళ్లినట్లు గుర్తించిన వ్యక్తుల వివరాలను ఇప్పటికే ఇమిగ్రేషన్, పాస్‌పోర్టు అధికారులు అందజేశామని, వారిని భారత్‌కు రప్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఐడీ అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు అరెస్టయిన వారిలో హైదరాబాద్‌కు చెందిన ఫేక్‌సర్టిఫికెట్ల తయారీదారుడు అబ్దుల్ సత్తార్, డి.అశోక్‌రావు, మరియప్పన్, మునీందర్, చాంద్‌ఖాన్, హబీబుల్లా జైలులో ఉండగా.. మిగతా వారు బెయిల్‌పై బయటకు వచ్చారు.

ఏపీలో బీజేపీకి 6 ఎంపీ, 10 అసెంబ్లీ సీట్లు

» 144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ పోటీ
» 8 గంటలపాటు మూడు పార్టీల నేతల భేటీ

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పొత్తుల్లో ఎవరికి ఎన్ని సీట్లు అనే అంశంపై టీడీపీ, జనసేన, బీజేపీ తుది నిర్ణయానికి వచ్చాయి. సోమవారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ ప్రతినిధులుగా కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఎంపీ వైజయంత్ పాండే సుమారు 8 గంటలు చర్చలు జరిపారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. అనంతరం.. ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేయనున్నదీ వివరిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం... తెలుగుదేశం పార్టీ 17 పార్లమెంటు, 144 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుంది. జనసేన రెండు లోక్‌సభ, 21 అసెంబ్లీ స్థానాల్లో బరిలో దిగనుంది. ఇక.. బీజేపీ ఆరు పార్లమెంటు, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుంది. పొత్తుల్లో భాగంగా బీజేపీ, జనసేనకు కలిపి 8 పార్లమెంటు, 30 అసెంబ్లీ స్థానాలను ఇవ్వాలని తొలుత భావించారు. ఇప్పుడు... అసెంబ్లీ స్థానాల సంఖ్య 31కి పెరిగింది. తొలుత జనసేనకు 24 అసెంబ్లీ, మూడు పార్లమెంటు సీట్లు ఇచ్చారు. బీజేపీతో పొత్తు అనంతరం జనసేన ఒక ఎంపీ స్థానాన్ని, 3 అసెంబ్లీ స్థానాలను త్యాగం చేయాల్సి వచ్చింది. టీడీపీ కూడా ఒక అసెంబ్లీ స్థానాన్ని తగ్గించుకోవాల్సి వచ్చింది.

వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డికి బెయిల్

» సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ఆంధ్రలో అడుగుపెట్టొద్దు
» రెండు పూచీకత్తులు సమర్పించాలి: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక నిందితుడు (ఏ-5) దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో అధిక శాతం సాక్షులు ఉన్న ఆంధ్ర రాష్ట్రంలోకి సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ప్రవేశించరాదని స్పష్టం చేసింది. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్, రెండు పూచీకత్తులు సమర్పించాలని.. ప్రతి సోమవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్)లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. పిటిషనర్ సీబీఐ కోర్టులో పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని.. దర్యాప్తునకు సహకరించాలని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం ఆదేశాలిచ్చారు. శివశంకర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గతేడాది సెప్టెంబర్లో హైదరాబాద్ సీబీఐ కోర్టు కొట్టివేసింది. ఈ హత్య కేసులో 2021 నవంబర్ నుంచి జైల్లో ఉంటున్నానని.. సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేసి బెయిల్ మంజూరు చేయాలని ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ మేరకు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. ఆయన సాక్షులను ప్రభావితం చేస్తే సీబీఐ లేదా సునీతారెడ్డి ఆయన బెయిల్ రద్దుచేయాలని కోరవచ్చంటూ విచారణను ముగించింది.

జేబీబీ పార్టీలో చేరిన కోడికత్తి శ్రీను

» అమలాపురం నుంచి ఎన్నికల బరిలోకి...

విజయవాడ(ఆంధ్రజ్యోతి), ముమ్మిడివరం, మార్చి 11: జనిపల్లి శ్రీనివాసరావు(కోడికత్తి శ్రీను) రాజకీయ రంగప్రవేశం చేశారు. సోమవారం ఆయన జై భీమ్‌రావ్ భారత్ పార్టీలో చేరారు. విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం రాణేలంక పెదపేటలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో సామాన్యులకు న్యాయం జరిగే వరకు తాను పోరాటం సాగిస్తానని ప్రకటించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా అవి సక్రమంగా అర్హులకు చేరడం లేదన్నారు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు.

మా కుటుంబం త్వరలోనే టీడీపీలోకి: మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో అద్భుతాలు జరుగడం ఖాయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసే విధంగా కృషిచేస్తానని తెలిపారు. సోమవారమిక్కడ ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడు రాఘవరెడ్డితో కలిసి తాను పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.



రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 11: కాగజ్‌నగర్ మార్కెట్ ప్రాంతంలో రాయితీ బియ్యం కొనుగోలు చేస్తున్న ఇద్దరు వ్యాపారులపై కేసునమోదు చేసినట్లు డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్యాంలాల్ సోమవారం తెలిపారు. కిరాణా షాపుల్లో బియ్యం నిల్వలు ఉన్నట్లు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు తూడూరు సురేష్, ఇర్ఫాన్ దుకాణాల్లో ఆదివారం రాత్రి తనిఖీలు చేయగా 3క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమయ్యిందని, ఇద్దరిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మహిళా శక్తి పథకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపుకలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, మార్చి 11: హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో మంగళవారం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న తెలంగాణ మహిళాశక్తి పథకం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్డీవో సురేందర్, డీపీవో భిక్షపతి గౌడ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రూ.కోటివరకు రుణం, బీమా సౌకర్యం అందించడంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన మహిళాశక్తి పథకం కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా జిల్లా నుంచి 15బస్సుల్లో 750ఎస్ఎస్‌జీ సభ్యులను తరలించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలన్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో తుకారాం, ఏపీడీ రామకృష్ణ, ఆర్టీసీ డిపో మేనేజర్ కృష్ణమూర్తిపాల్గొన్నారు.

ఏఎస్పీగా ప్రభాకర్‌రావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఎస్పీ ప్రభాకర్‌రావు

ఆసిఫాబాద్, మార్చి 11: జిల్లా ఏఎస్పీ(అడ్మిన్)గా ప్రభాకర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా ఏఎస్పీగా పనిచేస్తున్న ప్రభాకర్‌రావును కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా ఏఎస్పీగా ప్రభుత్వం బదిలీ చేసింది. గతంలో ఇక్కడ పనిచేసిన అచ్చేశ్వర్ రావు ఇంటలిజెన్స్ ఏఎస్పీగా బదిలీ అయ్యారు. ఈమేరకు పలువురుసీఐలు, ఎస్సైలు మర్యాదపూర్వకంగా ప్రభాకర్ రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రీడింగ్ రూంను సద్వినియోగం చేసుకోవాలి



లైబ్రరీ, రీడింగ్ రూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 11: స్థానిక ప్రజాకార్యాలయంలో ప్రారంభించిన నూతన లైబ్రరీ, రీడింగ్ రూంను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నా రు. సోమవారం లైబ్ర రీ, రీడింగ్‌రూంను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. మాజీఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తమరావు స్మారక లైబ్రరీ, రీడింగ్‌రూంను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా దివంగత పురుషోత్తమరావు స్మారక లైబ్రరీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీపరీక్షల విద్యార్థులు, ప్రతిఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ కౌన్సిలర్లు ఈర్ల విశ్వేశ్వర్ రావు, సిందం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, నాయకులు వీరభద్రాచారి, వెంకటేశ్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఇంటిపన్ను వందశాతం వసూలు చేయాలి: డీపీవో



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో భిక్షపతిగౌడ్

కెరమెరి, మార్చి 11: గ్రామాల్లో వంద శాతం ఇంటిపన్నులు వసూలు చేయా లని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యాలయ రికార్డులను పరిశీలించారు. అనంతరం డిమాండ్ రిజిస్టర్‌ను పరిశీలించి ఇప్పటివరకు వసూలైన పన్నులు ఎంత అని కార్యదర్శి భీమ్మయ్యను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఎంపీవో అంజాద్‌పాషా, కార్యదర్శి భీమ్మయ్య, కారోబార్ వెంకన్న తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 11: కాగజ్‌నగర్ మండలంలోని నామనగర్‌కు చెందిన సాయి(18) సోమవారం అను మానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నామానగర్‌కి చెందిన మొండి, లక్ష్మిల కుమార్తెను సాయి సంవత్సరంగా ప్రేమిస్తున్నాడు. సదరు యువతి మైనర్ కావడంతో పెళ్లిని గ్రామపెద్దలు పంచాయతీ నిర్వహించి వాయిదా వేశారు. అప్పటినుంచి సాయి తన ప్రేయసి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఒక్కసారిగా కింద పడిపోవడంతో స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే సాయి మృతిచెందాడు. మృతుడి మెడపై గాటు ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఈజ్‌గాం ఎస్సై రమణ్‌కుమార్ వివరించారు.

కార్యదర్శులపైనే భారం..



- గ్రామపంచాయతీల పదవీకాలం ముగియడంతో అవస్థలు
- గ్రామాలకు ఏడాదిగా నిలిచిపోయిన ప్రభుత్వ నిధులు
- అప్పులు చేసి నిర్వహిస్తున్న కార్యదర్శులు

బెజ్జూరు, మార్చి 11: సర్పంచుల పదవీకాలం ముగిసి నెలరోజులు పూర్తికావడంతో గ్రామపంచాయతీల నిర్వహణ బాధ్యత మొత్తం కార్యదర్శుల పైన పడింది. పంచాయతీల ఆదాయానికి మించి నిర్వహణ ఖర్చులు ఉంటున్నాయి. అయితే దాదాపు ఏడాదిగా ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడంతో సర్పంచులే ఎలాగోలా నెట్టుకొచ్చారు. ఇప్పుడు వారి పదవీకాలం కూడా ముగి యడంతో కార్యదర్శులే అప్పులు చేసి పంచాయతీ లను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభు త్వం ప్రత్యేకాధికారులను నియమించినా ప్రేక్షక పాత్ర వహిస్తుండటంతో భారం మొత్తం కార్యదర్శు ల పైనే పడింది. జిల్లాలో 335 గ్రామపంచాయతీ లున్నాయి. సర్పంచుల పదవీకాలం గత నెలతో ముగిసింది. అంతకు 7నెలల ముందు నుంచే సర్పంచులకు చెక్కుల ద్వారా చెల్లింపులను గత ప్రభుత్వం నిలిపివేసింది. అప్పటి నుంచి సర్పంచులు కూడా గ్రామాల్లో సమస్యల పరిష్కా రంపై చేతులెత్తేశారు. గ్రామాల్లో లెక్కకుమించి తాము ఖర్చు చేసినా.. బిల్లులు రావడం లేదని పనులను చేయడం నిలిపివేశారు. దీంతో గ్రామంలో తప్పని సరిగా వినియోగించాల్సిన ట్రాక్టర్, డీజిల్, పారిశుధ్య నిర్వహణ, నర్సరీ, డంపింగ్ షెడ్ నిర్వహణ, పల్లెప్రకృతి వనాలు, శ్మశానవాటికల నిర్వహణ, తాగునీటి సరఫరా, ట్యాంకుల క్లోరినేషన్ బాధ్యతలను గ్రామకార్యదర్శులే చేపట్టాల్సిన పరిస్థితి వచ్చింది. గ్రామపంచాయతీలకు రావాల్సిన పన్నుల వసూళ్లు అంతంత మాత్రంగానే ఉన్నా పనుల నిర్వహణకు తప్పని పరిస్థితిలో పంచాయతీ కార్యదర్శులే అప్పులు చేయక తప్పడం లేదు.

కేంద్ర నిధులతో సరిపెట్టారు..

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయా ల్సిన నిధులను గత ప్రభుత్వం 20నెలలుగా విడుదల చేయ లేదు. ఎస్ఎఫ్‌సీ గ్రాంట్ ద్వారా జనాభా ప్రాతిపదికన రూ.68 వేలు చిన్న గ్రామ పంచాయతీకి అందాలి. అందులోనే సిబ్బంది జీతాలు, కరెంటు బిల్లులు, ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, వీధి దీపాల నిర్వహణ ఖర్చులు చెల్లించాల్సి ఉంటుంది. 20నెలల నుంచి గత ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో కొన్నాళ్లు గ్రామ పంచా యతీ కార్యదర్శులే అప్పులు చేసి నిర్వహించారు. వారికి కూడా గత ఏడు నెలల నుంచి చెక్కుల ద్వారా చెల్లింపులు నిలిపివేశారు. వారి పదవీకాలం ముగియడంతో గ్రామ కార్యదర్శులే భారం మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

స్పెషల్ డ్రైవ్ ద్వారా జేబులు గుల్ల..

అసలే జీతాలు రాని కార్యదర్శులకు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ ద్వారా పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని హుకూం జారీ చేసింది. స్పెషల్ డ్రైవ్ కింద మురికికాలువలు, తాగునీటి పైపులైన్లు, ప్రభు త్వ కార్యాలయాలను శుభ్రం చేయడం, దోమల మందు పిచికారి చేయడంతో పాటు ప్రత్యేకంగా కూలీలను సమకూర్చి కూలీ చెల్లించాల్సి ఉంటుంది. చిన్న పంచాయతీలకు సుమారు రూ.15వేల వరకు స్పెషల్ డ్రైవ్‌కు ఖర్చయితే, ప్రజాపాలన ద్వారా రూ.10వేలను మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. గృహజ్యోతి సర్వేతో పాటు పలు పనులు చేట్టిన ప్పటికీ నిర్వహణ ఖర్చులను చెల్లించలేదు. చిన్న పంచాయతీల్లో సిబ్బంది జీతాలు కూడా సకాలంలో చెల్లించకపోవడంతో చాలా చోట్ల వారి నుంచి సహాయ నిరాకరణ ఎదురైంది. గ్రామానికి వివిధ శాఖల నుంచి కేటాయించిన స్పెషల్ అధికారులు కేవలం ప్రేక్షకపాత్ర వహిస్తుండ టంతో కార్యదర్శులే అప్పులు చేసి అన్నిఖర్చులు భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



సిర్పూర్(యు)లో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

జైనూర్, మార్చి 11: మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్‌నాయకులు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు షేక్‌ముఖీద్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం ఆరుగ్యారంటీలలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీఎంపీటీసీ రాథోడ్ రమేష్, శ్రీనివాస్, ఆనంద్, ప్రకాష్, వసీం, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండలకేంద్రంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫొటోలకు క్షీరాభిషేకంచేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం ఫిట్‌మెట్‌తోపాటు కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తునందుకు సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశామన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమం కోసం పని చేస్తుంద న్నారు. రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సోయంమోతీరాం, ఆత్రం కాశీరాం, ఆత్రం దౌలత్‌రావు, సుద్దాల ఆనంద్, కోవసిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు న్యాయాధికారుల నియామకం

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి11: రాజీమార్గాన కేసుల పరిష్కారానికి ఈనెల16న జిల్లాకేంద్రంలోని న్యాయస్థానంలో నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణకు న్యాయధికారులు, లోక్‌అదాలత్ సభ్యులను నియమించినట్లు సీనియర్ సివిల్‌జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె యువరాజ తెలిపారు. సీనియర్‌సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్‌జడ్జి కోర్టులకు సంబంధించిన సివిల్, క్రిమినల్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టుకు చెందిన అన్నిరకాల కేసుల కోసం న్యాయధికారిగా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె యువరాజ, లోక్ అదాలత్ సభ్యులుగా ధీరజ్ భౌమిక్, ఎం చరణ్‌తేజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌కోర్టు, అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టులకు సంబంధించిన సివిల్, క్రిమినల్, కౌంపౌండబుల్, ఎక్సైజ్, డ్రంకన్‌డ్రైవ్, పెట్టి కేసుల పరిష్కారం కోసం న్యాయధికారిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె అనంతలక్ష్మి, లోక్‌అదాలత్ సభ్యులుగా కె కిషోర్, జె విద్యాసాగర్‌ను నియమించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలన్నారు.

జాతర ఆదాయం రూ.22.76లక్షలు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 11: మహాశివ రాత్రి సందర్భంగా ఏర్పాటుచేసిన జాతర సందర్భంగా ఆలయానికి రూ. 22,76,150 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్ గుప్తా తెలిపారు. సోమవారం ఆలయంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. గత సంవత్సరం కంటే ఈసారి రూ.4,14,030 ఆదాయం పెరిగినట్లు ఆయన పేర్కొన్నారు. హుండీల లెక్కింపు ఆదిలాబాద్ డివిజన్ దేవాదాయ ధర్మాదాయశాఖ పరిశీలకుడు రాజమౌళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మురళీధర్, సభ్యులు, వాసవిసేవా సమితి, పలు పాఠశాలల విద్యార్థులు, ఈస్‌గాం, తదితర పంచాయతీలకు, ప్రతీ ఒక్కరికి జాతరకు సహకరించినందుకు ఆలయకమిటీ తరపునధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఈసుగాం ఏఎస్సై హీరామన్, ఆలయ అర్చకుడు నరహరిశర్మ, ఇందారపు సంతోష్ శర్మ, శ్రీనివాస్‌చారి, రెవెన్యూ, దేవాదాయ శాఖ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యసాయిసేవాసదన్ వార్షికోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 11: పట్టణంలోని సాయినగర్ శ్రీసత్యసాయి సేవాసదన్ 9వవార్షికోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఐదు గంటలకు నగరసంకీర్తన, 6:30 గంటలకు పతాకావిష్కరణ,7గంటలకు హోమం, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదానం, సాయంత్రం 7గంటలకు సామూహిక భజన ఉంటుందని వారు పేర్కొన్నారు.

నేడు మండల సమావేశం

వాంకిడి, మార్చి 11: వాంకిడి మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల12న మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వరలక్ష్మి తెలిపారు. ఉదయం 11గంటలకుప్రారంభమయ్యే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 11: మండలంలోని బూర్గుడలో సోమవారం సీసీరోడ్డు పనులను కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ నాయకుడు శ్యాంనాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో గాజులజక్కయ్య, మేకర్తి కాశయ్య పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ప్రజలు

ఆసిఫాబాద్, మార్చి 11: ప్రజావాణి కార్యక్రమంలో వివిధసమస్యలపై ప్రజలు అందించిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటా మని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీఆర్వో లోకేశ్వర్‌రావు, ఆర్డీవో సురేష్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని యూనియన్ బ్యాంకు నుంచి ఫోర్‌లైన్ రోడ్డు వరకు అప్రోచ్ రోడ్డు నిర్మించాలని సాయినగర్ కాలనీవాసులు మహేష్, ఆశోక్, గిరిష్, ప్రదీప్, కిషన్‌గౌడ్, కురట్కర్ శంకర్ వినతిపత్రం సమర్పించారు. సిర్పూర్(టి) మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన జమీల్ తనకు ప్రభుత్వం మంజూరు చేసిన అసైన్డుభూమిలో విద్యుత్‌సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ఆసిఫాబాద్ పట్టణం కసాబ్‌వాడికి చెందిన విజయ్‌కుమార్ వాంకిడి మండలం జంబుల్దరిలో తనపేరిట ఉన్న భూమిని వేరేవ్యక్తి అక్రమంగా తనపేరిట పట్టా చేసుకున్నాడని దానిని రద్దుచేయాలని దరఖాస్తుఅందజేశాడు. లారీ అసోసియేషన్‌ప్రతినిధుల కారణంగా మిల్లు నిర్వహణకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందని ఈవిషయంలో చొరవచూపి కార్మికులను, పేపరుమిల్లును కాపాడాలని సిర్పూర్ పేపర్‌మిల్ పర్మినెంట్ కార్మికులవర్కర్స్ కమిటీసభ్యులు వినతిపత్రం అందజే శారు. బెజ్జూరు మండలం సోమిని గ్రామానికి చెందిన కమ్మరి ఇస్తారి తనకు వారసత్వంగా సంక్రమించిన భూమిని వేరే వ్యక్తి ఆక్రమించుకొని దొంగపట్టా చేయించుకున్నాడని ఈవిషయంపై విచారణచేపట్టి తనకున్యాయం చేయాలని దరఖాస్తు అందజేశాడు. బెజ్జూరు మండలం పోతేపల్లి, కాటేపల్లి గ్రామాల రైతులు ప్రాణహిత-చెవెళ్ల ప్రాజెక్టులో భూములుకోల్పోయామని నష్టపరిహారం అందజేయాలని విన్నవించారు. పంచాయతీ కార్మికుల పెండింగ్ వేత నాలను చెల్లించాలని సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు.

కార్పొరేట్ సంస్థలతో బీజేపీ కుమ్మక్కు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 11: దేశంలోని కార్పొరేట్ సంస్థలతో బీజేపీ ప్రభుత్వం కుమ్మక్కై దేశఆర్థికవిధానాన్ని అస్తవ్యస్తం చేస్తోందని సీపీఎం పట్టణకార్యదర్శి ముంజంఆనంద్ ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారంపార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా పట్టణంలోని ఎస్బీఐబ్రాంచి ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్బీఐచైర్మన్ ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వడం అవినీతికి నిదర్శనమన్నారు. ఎన్నికలబాండ్లు ఎన్డీఏ ప్రభుత్వం అవినీతి బాగోతం రుజువు చేశాయన్నారు. వేలకోట్ల రూపాయల ఎన్నికల ఫండుగా బాండ్లను మళ్లించారన్నారు. వెంటనే ఎస్బీఐ చైర్మన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోట శ్రీనివాస్, తిమ్మారావు, రవి, నితీశ్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులో మునిగి యువకుడి మృతి



విగ్నేష్(ఫైల్)

రెబ్బెన, మార్చి 11: మండలంలోని మాదవాయిగూడ సమీపంలోని జగన్నా థ్‌పూర్ ప్రాజెక్టులో మునిగి మండల కేంద్రానికిచెందిన వ్యాపారి సెల్వమణి కుమారుడు విగ్నేష్ (21)మృతిచెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపినవివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు ఆదివారం సాయంత్రం జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టులో ఈతకు వెళ్లారు. ఈత కొడుతున్న క్రమంలో విగ్నేష్ లోతు ఉన్న ప్రాంతంలోకి వెళ్లడంతో ఈతరాక నీటిలో మునిగి పోయాడు. సాయంత్రం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు వెతికించడంతో సాయంత్రం ప్రాజెక్టు అడుగుభాగంలో మృతదేహం లభించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మెట్లపై నుంచి పడి..



చంద్రశేఖర్(ఫైల్)

వాంకిడి, మార్చి 11: మండలకేంద్రంలోని ఇందిరా నగర్ కాలనీకిచెందిన పెందూర్ చంద్రశేఖర్(34) ఇంట్లోని మెట్లపై నుంచిపడి మృతి చెందినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి ఇంట్లోని బాత్‌రూంకు వెళ్లితిరిగి వస్తుండగా ఇంటిమెట్లు ఎక్కుతూ చంద్రశేఖర్ ప్రమాదవ శాత్తు పడిపోయాడు. దీంతో ఎడమకణితి, ఛాతీపై బలమైన గాయాలై స్పృహ కోల్పోయాడు. గమనించిన చంద్రశేఖర్ భార్య పెందూర్ విద్య కుటుంబ సభ్యులను పిలిచి వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడినుంచి ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

క్షతగాత్రులను పరామర్శించిన రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 11: కాగజ్‌నగర్ మండలం కడంబా సమీపంలో మూడురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ చింతలమానేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తపణ్, శ్రీనివాస్‌ను సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆర్థిక సహాయం అందించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చింతలమానేపల్లి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కెరమెరి, మార్చి 11: ఈనెల 13న మండల సర్వసభ్య సమావేశం నిర్వమిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణారావు తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు విధిగా హాజరు కావాలని సుచించారు.



డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచాలి

మందమర్రిటౌన్, మార్చి 11: మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో పనిచేస్తున్న సింగరేణి కోల్‌ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలనుపెంచాలని సింగరేణి కోల్‌ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ బెల్లంపల్లిరీజియన్ అధ్యక్షుడు బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో అనేక సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రైవర్లకు రూ.32వేలు, క్లీనర్లకు రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సంస్థకు వేలకోట్ల లాభాలు రావడంలో కోల్‌ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు, క్లీనర్ల పాత్ర కూడా ఉందన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ప్రమాదంలో మరణిస్తే రూ.20లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచేవరకు పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో, ప్రధానకార్యదర్శి మిట్టపల్లి పౌల్, రవి, జనార్ధన్, సంసీర్,కిరణ్‌కుమార్, మద్దిరెడ్డి,తిరుపతి, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చేసిన క్వార్టర్లను ఖాళీ చేయించాలి

మందమర్రిటౌన్, మార్చి 11: మందమర్రి ఏరియాలోని ఆయా కాలనీల్లో క్వార్టర్లను కబ్జా చేసి నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఏరియాలోని కేకే5గని వద్ద కార్మికులను సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఆయన మాటాడుతూ ఏరియాలో డిమాండ్ ఉన్న మార్కెట్ ఏరియా, 1వజోన్ తోపాటు వివిధ కాలనీల్లో ఉన్న క్వార్టర్లను కార్మికేతరులు దర్జాగా కబ్జా చేసుకుని నివాసం ఉంటుంటే నిరంతరం పనిచేస్తున్న కార్మికులకు క్వార్టర్లు దొరకడం లేదన్నారు. యాజమాన్యం దీనిపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. సమావేశంలో నాయకులు కంది శ్రీనివాస్, తదితరులుపాల్గొన్నారు.

రక్తదాతలు ఆదర్శనీయులు: జీఎం

శ్రీరాంపూర్, మార్చి 11: ఇతరుల అవసరాల కోసం రక్తదానం చేస్తున్న సింగరేణి ఉద్యోగులు ఆదర్శణీయులని శ్రీరాంపూర్ జీఎం బి సంజీవ రెడ్డి అన్నారు. ఆర్కే8 డిస్పెన్సరీలో సోమవారం రక్తదానం శిబిరం నిర్వహించగా, జీఎం ముఖ్య అతిథిగా హాజరై దాతలకు ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ, తలసేమియా, సికిల్‌సెల్, కిడ్నీ, క్యాన్సర్, తదితర వ్యాధిగ్రస్తులకు ఉద్యోగులు ఇచ్చే రక్తం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి రోగులకు ఈ రక్తాన్ని ఉచితంగా అందిస్తామన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో సంస్థ ప్రతిష్టలు మరింత పెరుగుతాయని ఆయన అన్నారు. 52వ సారి రక్తదానం చేసిన రాజ్‌కుమార్ అనే ఉద్యోగిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీ సైదా, ఎస్‌వోటు జీఎం వి పురుషోత్తమరెడ్డి, వీటీసీ మేనేజర్ కె వెంకట రామారావు, డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి, రెడ్‌క్రాస్‌సొసైటీ జిల్లా అధ్యక్షుడు కంకణాల భాస్కర్‌రెడ్డి, సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్, రెడ్‌క్రాస్, డిస్పెన్సరీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్క్‌మెన్ల పాత్ర కీలకమైనది..జీఎం

గనులు, విభాగాల్లో వర్క్‌మెన్ల పాత్ర కీలకమైనదని శ్రీరాంపూర్ జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ ఎంవీటీసీలో నూతన వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లకు అవగాహన సదస్సు నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గనుల్లో అన్ని పరిస్థితులను అధికారులతోపాటు వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు ఎల్లవేళలా పర్యవేక్షిస్తారని తెలిపారు. గనుల నిబంధనల్లో భాగంగా 10రోజులపాటు శిక్షణ ఉంటుందని, నిష్ణాతులైన శిక్షకులు అవ గాహన కల్పిస్తారని, వారిసూచనలతో పనిప్రదేశాల్లో ముందుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, ఎస్‌వోటు జీఎం వి పురుషోత్తమ రెడ్డి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, వీటీసీ మేనేజర్ కె వెంకట రామారావు పాల్గొన్నారు.

యూనియన్ అభివృద్ధికి కృషి చేసే వారికే పదవులు: ఏఐటీయూసీ

మందమర్రిటౌన్, మార్చి 11: యూనియన్ అభివృద్ధికి పాటుపడుతూ కార్మికుల సంక్షేమం కోసం పోరాడే వారికి పదవులు ఇస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం రాత్రి ఏఐటీయూసీ కార్యాలయంలో ఏరియాలోని కేకే5గని పిట్‌కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సింగరేణిలో ఇటీవల జరిగిన కార్మిక గుర్తింపుసంఘం ఎన్నికల్లో కార్మికులు తమ యూనియన్‌పై నమ్మకంతో గుర్తింపుసంఘంగా ఎన్నుకున్నారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండానే పనిచేస్తామన్నారు. టీబీజీకేఎస్ నాయకులు పూదరిశ్రీకాంత్ తన అనుచరులతో ఏఐటీయూసీలో చేరగా వారికి సీతారామయ్య కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం కేకే5 గని పిట్‌కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పిట్ కార్యదర్శిగా గాండ్ల సంపత్, ఇన్‌చార్జీగా కంది శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వసతులు కల్పించాలి

- ఐఎన్‌టీయూసీ ఏరియా కార్యదర్శి శీలం చిన్న

శ్రీరాంపూర్, మార్చి 11: వేసవిలో కార్మికులకు వసతులు కల్పించాలని ఐఎన్‌టీయూసీ ఏరియా కార్యదర్శి శీలం చిన్న అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో వేసవిలో కార్మికులకు కల్పించాల్సిన వసతులపై మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని మజ్జిగ ప్యాకెట్లు అందించాలన్నారు. ఎయిర్ కూలర్లు, చల్లటి తాగునీరు, టెంట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పనివేళలను ఉదయం 6నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, సాయంత్రం 4నుంచి రాత్రి 11గంటల వరకు మార్చాలని సూచించారు.

క్వారీలో దుమ్ము, ధూళి రాకుండా ట్యాంకర్లతో నీరు చల్లించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ పిట్ కార్యదర్శి బి జాన్సన్, కేంద్రకార్యదర్శి కాల్వ శ్రీను, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం. సుధాకర్, షిఫ్ట్ కార్యదర్శులు రాజశేఖర్, శ్రీను, లక్ష్మణ్, రమేష్ పాల్గొన్నారు.